ప్రజాశక్తి
శనివారం 25 ఫిబ్రవరి 2023
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

పార్వతమ్మకు అంతిమ వీడ్కోలు

◆ తిమ్మరాజుపేటకు వందలాది మంది రాక ◆ కన్నీటి సంద్రంగా జన హృదయాలు
◆ నివాళ్లర్పించిన బివి.రాఘవులు, సిహెచ్.నర్సింగరావు, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - అచ్యుతాపురం : సిపిఎం సీనియర్ నాయకురాలు, పోరాట యోధురాలు కర్రి పార్వతమ్మ అంతిమ యాత్ర వందలాది మందితో శుక్రవారం సాగింది. ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతిమ యాత్ర అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మ రాజుపేట గ్రామంలోని ఆమె స్వగృహం నుంచి ప్రారంభమైంది. తొలుత ఆమె పార్థివదేహం వద్ద సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు, తదితరులు నివాళ్లర్పించారు. ఆమె కుటుంబ సభ్యులు కర్రి సుందరయ్య, స్వామి బాబు, రూపవతి, సుగుణ, కాంచన, విప్లవ సంస్కృతి తదితరులను పరామర్శించి ఓదార్చారు. పార్టీకి చేసిన సేవలను, ఆమె పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పార్వతమ్మ పోరాటాలను గుర్తు చేస్తూ ప్రజానాట్యమండలి గాయకులు పలు గేయాలను ఆలపించారు. సంతాప సభలో పార్వతమ్మ ఉద్యమ ప్రస్థానాన్ని వక్తలు తెలిపారు. ఆమె మృతి సిపిఎంకు తీరని లోటుగా భావించారు. ఆమె మిగతా 2లో..

పార్వతమ్మ పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న రాఘవులు, లోకనాథం, నర్సింగరావు

పార్వతమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు, ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఏజెంట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి..

40 మంది నామినేషన్లు ఆమోదం

- నలుగురివి తిరస్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం) ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను విశాఖ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ సమక్షంలో అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16న నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి చివరి రోజు గురువారం వరకూ 44 మంది 70 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిలో నాలుగు నామినేషన్లను తిరస్కరించారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇమామ్ మోహియుద్దీన్ అహ్మద్, రుద్రరాజు కల్యాణ వర్మ, విజయనగరం జిల్లాకు చెందిన బొలిశెట్టి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొలుపురి నాగభారతి నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి మల్లికార్జున తెలిపారు. ఈ నెల 27 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. నామినేషన్ల పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు

▸ వార్త 4లో..

వాయు కాలుష్య నియంత్రణపై అవగాహన

▸ వార్త 3లో..

బిజెపితో ప్రభుత్వ రంగం ధ్వంసం

▸ వార్త 2లో..

సదస్సులో పాల్గొన్న ఎఫ్‌డిఎ డ్రగ్ క్వాలిటీ బృందం

నాణ్యతా వ్యవస్థలను మెరుగుపరచాలి

ఎఫ్‌డిఎ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసా వార్త 4లో..

ఘోర రోడ్డు ప్రమాదం

◆ బస్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన లారీ
◆ ఇద్దరు దుర్మరణం, 17 మందికి గాయాలు, ముగ్గురు పరిస్థితి విషమం
◆ బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎస్.రాయవరం : మండలంలోని పెనుగొల్లు ధర్మవరం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం అనకాపల్లి డిపోకి చెందిన ఆర్‌టిసి బస్సును వెనుక నుంచి ఓ లారీ బలంగా ఢీకొట్టింది. అక్కడితో ఆగక దాని ఎదురుగా ఉన్న ఆటోనూ గట్టిగా తాకింది. పదిహేను అడుగుల దూరం వరకూ వాహనాలను నెట్టుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. 17 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్‌టిసి బస్సు 48 మంది ప్రయాణికులతో పాయకరావుపేట వెళ్తోంది. ధర్మవరం గ్రామం వద్ద ప్రయాణికుల కోసం ఆగింది. అదే మార్గంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ మిగతా 2లో..

క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

మొదటి పేజీ తరువాయి..

సంతాప సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

పార్వతమ్మకు అంతిమ వీడ్కోలు

అడుగుజాడల్లో ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించి పనిచేయాలని ప్రతినబూనారు. పార్వతమ్మ కుటుంబానికి అండదండగా ఉంటామని భరోసా పలికారు. పార్వతమ్మ పార్టీకి, ప్రజలకూ చేసిన సేవలు ఎన్నటికీ మరువలేమన్నారు. అనంతరం తిమ్మరాజుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, గ్రామ సచివాలయం మీదుగా ఓవర్ హెడ్ ట్యాంక్ వరకూ, అక్కడ నుంచి స్వర్గధామం శ్మశాన వాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. ఆయా కార్యక్రమాల్లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, సిఐటియు నాయకులు ఆర్.శంకరరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, ఆర్.రాము, వివి.శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, ఐద్వా నాయకులు బి.పద్మ, సుమిత్ర, శేషారత్నం, పలువురు ప్రముఖులు ఎస్‌వికె.పరశురాం, రమణాజీ, అచ్యుతాపురం మండలాధ్యక్షులు కోన బుజ్జి, మాజీ సర్పంచ్ బి.రాందాస్, బిసి సెల్ నాయకులు కర్రి ఆదిబాబు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎస్.నాగమణి, ప్రజానాట్యమండలి నాయకులు గుర్రం రమణ, రామ్‌కుమార్, ఆత్మారామ్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు

ఘోర రోడ్డు ప్రమాదం

బలంగా ఢీకొట్టింది. దీంతో ఆగి ఉన్న బస్సు, దాని ఎదురుగా ఉన్న ఆటో సుమారు పదిహేను అడుగుల లోతులోకి దూసుకుపోయాయి. అప్రమత్తమైన బస్ డ్రైవర్ బస్ బోల్తా పడకుండా చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు 17 మంది గాయపడ్డారు. విశాఖకు చెందిన కూలి అప్పలరాజు మృతిచెందాడు. కెజిహెచ్‌కు తరలిస్తుండగా పెద్దగుమ్ములూరుకు చెందిన వ్యక్తి చనిపోయాడు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. మిగిలిన వారిని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరిశీలించి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులను ఆదుకోవాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి పరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో కోరారు. ఈ దుర్ఘటనపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు వేరొక ప్రకటనలో కోరారు.

రక్తహీనత నివారణకు మందులు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో వివిధ పాఠశాలలలో చదువుచున్న బాలబాలికలకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి, సంబంధిత మందులు అందజేయాలని ఎడిఎంహెచ్ఒ డాక్టర్ అనూషను రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో మాట్లాడుతూ ఎనీమియా ముక్తి భారత్ ప్రోగ్రామ్ ద్వారా ఏజెన్సీలోని అన్ని విద్యాలయాల్లో వైద్య పరీక్షలు చేయాలని సూచించారు.

బిజెపితో ప్రభుత్వ రంగం ధ్వంసం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలనూ కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం కోసం వాటిని ధ్వంసం చేస్తోందని సిఐటియు జిల్లా నాయకులు వై.రాజు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 694వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ప్రభుత్వ రంగ సంస్థలు ఎంతో కీలకపాత్ర నిర్వహిస్తున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక సంస్థలకు వివిధ రకాల పన్నుల రూపంలో వీటి ద్వారా గణనీయంగా ఆదాయం లభిస్తోందన్నారు. అయినప్పటికీ వాటిని ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలులో ఉండే రిజర్వేషన్లను ప్రైవేటీకరణతో కోల్పోవలసి ఉంటుందన్నారు. ఇదే జరిగితే దళిత, గిరిజన వంటి అణగారిన తరగతులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయన్నారు. దీక్షల్లో కె.నర్సింగరావు, కె.సంతోష్, సిహెచ్.రామారావు, పి.ఈశ్వరరావు, కెవిపి.చంద్రమౌళి పాల్గొన్నారు.

ఆర్‌ఎసి విభాగంలో మార్కెట్ వాటాపై హిటాచి దృష్టి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రానున్న వేసవి సీజన్‌లో భారత దేశ ప్రీమియం ఎయిర్ కండిషనర్ బ్రాండ్ హిటాచి కూలింగ్ అండ్ హీటింగ్ తయారీదారు ఆర్‌ఎసి కేటగిరీలో మార్కెటింగ్ వాటాలపై దృష్టి సారించి ముందుకు సాగుతోందని జాన్సన్ కంట్రోల్స్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ఎమ్‌డి గుర్మీత్ సింగ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రథమార్ధంలో పది శాతం కంటే ఎక్కువ మార్కెట్ వాటాను సాధించడంతోపాటు 25 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎయిర్ హోం సిరీస్ ఉత్పత్తి డిజైన్ అవార్డు కూడా తాము గెలుచుకున్నట్లు తెలిపారు. 15 శాతం విద్యుత్ ఆదాతో సురక్షితమైన, పరిశుభ్రమైన ఇండోర్ వాతావరణాన్ని హిటాచి అందిస్తుందని హామీ ఇచ్చారు.

పలు ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవిలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు సేవలను ముందుకుతెచ్చింది. ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా 08579 విశాఖపట్నం - సికింద్రాబాద్ వీక్లీ స్పెషల్ రైలు మార్చి 1 నుంచి 26 వరకూ ప్రతి బుధవారం సాయంత్రం 19.00 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 08580 సికింద్రాబాద్ - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు మార్చి 2 నుంచి 27 వరకు ప్రతి గురువారం సాయంత్రం 19.40 గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08585 విశాఖపట్నం - మహబూబ్‌నగర్ వీక్లీ స్పెషల్ రైలు మార్చి 7 నుండి 25 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 17.35 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటుంది. 08586 మహబూబ్‌నగర్ - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు మార్చి 8 నుండి 26 వరకు వరకు ప్రతి బుధవారం సాయంత్రం 18.20 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08583 విశాఖపట్నం - తిరుపతి వీక్లీ స్పెషల్ రైలు మార్చి 6 నుంచి 24 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 19.00 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 08584 తిరుపతి - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ మార్చి 7 నుంచి 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 21.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08543 విశాఖపట్నం-బెంగుళూరు కాంట్ వీక్లీ స్పెషల్ రైలు మార్చి 5 నుండి ఏప్రిల్ 30 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15.55 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.15 గంటలకు బెంగళూరు కాంట్ చేరుకుంటుంది. 08544 బెంగుళూరు కాంట్ - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ మార్చి 6 నుంచి మే 1 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

02809 భువనేశ్వర్-తిరుపతి వీక్లీ స్పెషల్ రైలు శనివారాల్లో మార్చి 4 నుంచి ఏప్రిల్ 29 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 13.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 02810 తిరుపతి-భువనేశ్వర్ వీక్లీ స్పెషల్ మార్చి 3 నుండి ఏప్రిల్ 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 20.00 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 16.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది.

మళ్ల సత్యనారాయణకు పరామర్శ

ప్రజాశక్తి - అనకాపల్లి : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఎం నాయకులు మళ్ల సత్యనారాయణను శుక్రవారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, నాయకులు సిహెచ్.నర్సింగరావు, ఎం.జగ్గునాయుడు, జె.అయోధ్యరామ్ పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

మళ్ల సత్యనారాయణతో రాఘవులు, నర్సింగరావు, జగ్గునాయుడు తదితరులు

నూతన విద్యా విధానంతో నష్టం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: నూతన ఎడ్యుకేషన్ పాలసీతో గిరిజన ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్ పావని తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన అరకు వేలి గిరిజన సంఘం కార్యాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులకు శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో సుమారు 87 పాఠశాలలు మూసివేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన చాలా దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మార్చాయని విమర్శించారు.

ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభలు ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళం పట్టణంలో జరుగుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, కార్యదర్శి సిహెచ్.వెంకటరావు తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

విశాఖ పోర్టులో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ, లాజిస్టిక్స్ విభాగం ప్రత్యేక కార్యదర్శి సుమిత దవ్రా శుక్రవారం విశాఖ పోర్టును సందర్శించారు. ఆమెకు పోర్టు ఛైర్మన్ రామ్మోహన్‌రావు సాదర స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. లాజిస్టిక్ డేటా బ్యాంక్ కింద చేపట్టిన కంటైనర్ టెర్మినల్ కార్యచరణ సామర్థ్యంపై చర్చించారు.

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మార్చి 3, 4 తేదీలలో నగరంలోని ఆంధ్ర యూనివర్సిటీ మైదానంలో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పోలీసు అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సదస్సు జరిగే ప్రాంతాలను, వివిఐపిలు, పారిశ్రామిక వేత్తలు సందర్శించే ప్రాంతాలను విస్తృతంగా తనిఖీ చేశారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక

ప్రజాశక్తి-కోటవురట్ల: ఈ నెల 27, 28న నిర్వహించ నున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు కోటవురట్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు పొన్నాడ పద్మశ్రీ, శ్రీపాద మనస్విని ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏసుదాసు తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్ విద్యుత్ ఉత్పత్తిపై నిర్వహించిన ఎగ్జిబిషన్లో ప్రథమ స్థానం సాధించడంతో వీరు రాష్ట్రస్థాయిలో ఎగ్జిబిషన్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు.

నక్కపల్లి: అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన - 2023 పోటీలలో గొడిచెర్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రామప్రతాపరావు తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన పరిశుభ్రత - ఆరోగ్యకర గ్రామం అనే ప్రాజెక్టు జిల్లాస్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈ నెల 27, 28 వ తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీకి విద్యార్థులు అర్హత సాధించారని హెచ్ఎం తెలిపారు. ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పాత గాజువాక జంక్షన్‌లో రహదారి విస్తరణ

- ట్రాఫిక్ నియంత్రణకు తాత్కాలిక చర్యలు
- డివైడర్ల తొలగింపుతో రోడ్డు వెడల్పు పనులు
- వాహనాలను నేరుగా మళ్లింపునకు ఏర్పాట్లు

డివైడర్ల తొలగింపుతో రోడ్డు వెడల్పు చేస్తున్న పనులు

ప్రజాశక్తి -గాజువాక : రేయింబవళ్లు తేడా లేకుండా, నిత్యం విపరీతమైన రద్దీతో ఉండే పాతగాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పాతగాజువాక జంక్షన్‌లో ఉన్న డివైడర్లను తొలగించి, ఒకేసారి మూడు పెద్ద వాహనాలు పోయేంత వీలుగా జంక్షన్‌ను వెడల్పు చేస్తున్నారు. తద్వారా కొన్ని మార్గాల్లో వాహనరాకపోకలు నేరుగా పోయే విధంగా ఏర్పాట్లు చేసి, ట్రాఫిక్ రద్దీని తగ్గించే చర్యలు చేపడుతున్నారు.

గాజువాక పేరు చెప్పితే మొట్టమొదటగా ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది పాత గాజువాక జంక్షన్. అటు సింధియాను, ఇటు జాతీయరహదారిపై అటూఇటూ ఉన్న మార్గాలు ఈ జంక్షన్ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ వలయంగా ఉంటుంది. జాతీయ రహదారిపై వెళ్లే లారీలు, ఇతర వాహనాలు, సిటీ, రూట్‌బస్సులు, విద్యాలయాలు, ఫార్మా, ఇతర కంపెనీలకు రాకపోకలు సాగించే వందలాది భారీ వాహనాలకు అంతకుమించిపోయేలా ఆటోలు, కార్లు, ఇతర చిన్నవాహనాలు, వేలసంఖ్యలో ద్విచక్రవాహనాలతో గాజువాక సెంటర్ వాహనరద్దీతో హోరెత్తిపోతూ ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈజంక్షన్‌ను అరగంటలోపు దాటిపోతే తొందరగా వెళ్లిపోయినట్లే.. ఇలా నిత్యం వేలాది వాహనాలతో విపరీతమైన రద్దీతో ఉన్న పాతగాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ ప్రతిపాదనలు కొన్నేళ్లుగా కాగితాల్లోనే నలిగిపోతూ, నిధుల ేమి అంటూ కార్యరూపం దాల్చడం లేదు.

మరోవైపు అభివృద్ధి విస్ఫోటనం పుణ్యమాని నానాటికీ పెరిగిపోతున్న వాహనరద్దీతో పాతగాజువాకలో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు సవాల్‌గా మారగా, ప్రజలు, వాహనదారులైతే నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఉదయం,సాయంత్రం వేళల్లో భారీ ట్రాఫిక్

పాత గాజువాక జంక్షన్‌తోపాటు అటు శ్రీనగర్ రైల్వే ఫ్లైఓవర్, ఇటు బిహెచ్‌పివి వరకు, కొత్తగాజువాక రూటులో కన్యశ్రీకన్య జంక్షన్ వరకు ఉదయం సాయంత్రం వేళల్లో భారీ ట్రాఫిక్‌తో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనగర్ వైపు నుంచి నగరంలోకి వెళ్లే వాహనాలు నేరుగా పోయేందుకు ప్రత్యేకంగా మార్గం ఉన్నప్పటికీ, ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయే పరిస్థితి, నాలుగైదు పర్యాయాలు సిగ్నల్ పడినా దాటివెళ్లే పరిస్థితి ఒకేసారి ఉండదంటే ఎంత ట్రాఫిక్ ఉంటుందో ఇట్టే అర్థమౌతుంది.

జంక్షన్ విస్తరణతో తాత్కాలిక ఉపశమన చర్యలు

ఈ నేపథ్యంలో పాతగాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించాలంటే ఇక్కడున్న జంక్షన్‌ను, రోడ్లను విస్తరణ చేయడమొక్కటే తాత్కాలిక ఉపశమన చర్యలుగా భావించిన అధికారులు, ఈ మేరకు చర్యలు చేపడుతున్నారు. పాతగాజువాక జంక్షన్‌లో డివైడర్లు, చిన్న పార్కుగా ఉన్న ప్రాంతాలను తొలగించి, రెండు రోజులుగా రోడ్డు వెడల్పు చేస్తున్నారు. ఒకేసారి మూడు మార్గాల్లో వాహనాలను మళ్లించడం ద్వారా ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీని తాత్కాలికంగా నియంత్రించే పనులు చేపడుతున్నారు. పనులు పూర్తయిన తర్వాత ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

మృతుడు తేజ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మెయిన్‌రోడ్డు గజపతినగరం వద్ద శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చోడవరం పట్టణం లక్ష్మీదేవి పేటకు చెందిన తేజ(30) అనే యువకుడు మృతి చెందాడు. చోడవరం నుండి అనకాపల్లి వైపు బైక్‌పై వెళుతుండగా గజపతినగరం వద్ద అటుగా వస్తున్న వాహనాలను ఢీకొనడంతో ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలంలో ఎటువంటి వాహనం లేదు. సంఘటన స్థలానికి కుటుంబీకులు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అగ్ని ప్రమాదంలో పాక దగ్ధం

బాధితులను పరామర్శిస్తున్న నేతలు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటి కమ్మలపాక దగ్ధమైన ఘటన పిఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు జివిఎంసి ఆరోవార్డు పిఎం.పాలెం, ఆర్‌హెచ్ కాలనీలో పెయింటింగ్ పనులు చేస్తూ, ఇరవై ఏళ్లుగా లక్ష్మణరావు కుటుంబంతో తాటాకింట్లో నివాసం ఉంటున్నారు. ఆస్పత్రిలో ఉన్న సమీప బంధువును పరామర్శించడానికి గురువారం రాత్రి వెళ్లిన కాసేపటికే ఇంట్లో మంటలు చెలరేగి పాక పూర్తిగా దగ్ధమైంది. ఆసుపత్రికి వెళ్లిన లక్ష్మణరావు కుటుంబీకులు తిరిగి ఇంటికొచ్చేసరికి సర్వం ఆగ్నికి ఆహుతైంది.

స్థానికుల సమాచారంతో ఫైరింజన్ వచ్చి మంటలు అదుపు చేసినప్పటికీ అప్పటికే ఇంట్లో ఉన్న సుమారు రూ.లక్ష విలువైన గృహోపకరాలు బూడిదయ్యాయి. నిరాశ్రయులైన బాధిత కుటుంబీకులకు స్థానికులు ఆశ్రయం కల్పించారు. శుక్రవారం వైసిపి నాయకులు ఇఎన్‌ఎస్ చంద్రరావు, కొండపల్లి వరలక్ష్మి, ఈశ్వరరావు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సహాయం అందించారు

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి -ఆనందపురం: అనందపురం మండలం గంభీరం గ్రామపంచాయతీ, బోయపాలెం గ్రామంలో నివాసముంటున్న వెంపాడ పవన్‌కుమార్ (23) అవంతి కాలేజీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం కాలేజీకి వెళ్లిన పవన్‌కుమార్, సాయంత్రానికి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబీకులు, స్నేహితులు పలుచోట్ల వాకప్ చేశారు. అయితే ఆచూకీ దొరకకపోవడంతో పవన్‌కుమార్ తండ్రి రామచంద్రారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, శ్యామ్ సుందర్ దర్యాప్తు చేస్తున్నారు.

26న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : సేవా స్ఫూర్తి అసోసియేషన్, అపోలో డయాగ్నొస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సేవాస్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. జివిఎంసి పదో వార్డు రవీంద్రనగర్ చివరి బస్‌స్టాపు దరి సేవాస్ఫూర్తి భవన్‌లో ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాల్లో ఉదయం 7 గంటల నుంచి 10గంటల వరకు మధుమేహం, రక్తపోటుకు ఉచితపరీక్షలు నిర్వహిస్తారన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పన్న సన్నిధిలో జస్టిస్ సీతారామమూర్తి

జస్టిస్‌కు ప్రసాదాన్ని అందిస్తున్న ఎఇఒ

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను మానవ హక్కుల కమిషన్ గౌరవాధ్యక్షులు జస్టిస్ మందాత సీతారామమూర్తి శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ సాంప్రదాయ ప్రకారం సాగర స్వాగతం పలికారు. ఆయన ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకొని బేడా మండపం ప్రదక్షిణం చేసి, తర్వాత స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోను ప్రత్యేక పూజలు జరిపారు. ఆస్థాన మండలంలో అర్చకులు ఆశీర్వదించగా ఎఇఒ ఆనంద్ కుమార్ శాలువాతో సత్కరించి ప్రసాదాన్న అందించారు.

యాత కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లనువైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం జిల్లా వైసిపి కార్యాలయంలో సన్మానించారు. యాత కార్పొరేషన్ డైరెక్టర్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు

కోలా గురువులుకు అభినందన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి ఎంపికైన కోలా గురువులును ఎపి యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడితబోయిన రాములప్పడు అభినందించారు. శుక్రవారం నగరంలోని గురువులు నివాసానికి వెళ్లి, పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు

జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

లాకౌట్ బాధిత కార్మిక సంఘం నేతలు

నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -తగరపువలస : జ్యూట్ మిల్లు కార్మికులందరికీ చెల్లింపులు చేసినట్లుగా అటు జెసిఎల్, ఇటు న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించిన జ్యూట్ యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఎస్ఎన్ రాజు, జీరు వెంకటరమణ, గౌరవాధ్యక్షులు ఎన్. అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్ర వారం సంఘంకార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, చెల్లింపుల కోసం తమ సంఘ సభ్యులతో పాటు సుమారు 500 మంది కార్మికులు కనీసం దరఖాస్తు చేసుకోలేదన్నారు. దరఖాస్తు చేసుకోలేనప్పుడు, తమకు చెల్లింపులు చేసినట్లుగా యాజమాన్యం తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమని తీవ్రంగా ఖండించారు. కార్మికులను, కోర్టులను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్న యాజమాన్యం, యాజమాన్య ప్రతినిధులు, నాలుగు కార్మిక సంఘాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు జెసిఎల్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు సింగిడి అప్పారావు, దాలయ్య రెడ్డి, జన్నుల రమణ, పి శివ, ఎం శంకర్ పాల్గొన్నారు.

వాయు కాలుష్య నియంత్రణపై అవగాహన

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ మురళీమోహన్

ప్రజాశక్తి- విశాఖపట్నం :'వాయు కాలుష్యం, మానవ ఆరోగ్యం' అనే అంశంపై ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. నగరంలోని మేఘాలయ హోటల్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో భాగంగా కెపాసిటీ బిల్డింగ్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ మురళీమోహన్ పాల్గొని, వివిధ రకాల కాలుష్య కారకాలు, కళ్లు, ముక్కు, గొంతు, శ్వాసకోశ వ్యవస్థకు చికాకు వివరించారు. సల్ఫర్‌డయాక్సైడ్ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నొప్పి కలిగిస్తాయన్నారు. చెత్తను కాల్చడం, పొగతాగడం, ప్రజారవాణాలో వెలువడిన కాలుష్యం, ప్రతి చిన్న అవసరానికి మోటారు వాహన వినియోగం వంటి చర్యలతో కాలుష్యం పెరిగి శారీరక రుగ్మతలు ఉత్పన్నమౌతాయన్నారు.

కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎస్.వెంకటేశ్వర్లు, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జెడ్ఒ ఎం.నాగార్జున, కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, రవాణా పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నోటీసులు వెనక్కు తీసుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో గెడ్డ ప్రాంత నివాసితుల ధర్నా

ప్రజాశక్తి- పెందుర్తి : గెడ్డ ప్రాంతాల్లో నివాసితుల ఇళ్ల తొలగిపోవాలంటూ అధికారుల జారీ చేసిన నోటీసులను వెంటను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పెందుర్తి తహాశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా శుక్రవారం నిర్వహించారు..ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు జగన్ మాట్లాడుతూ మండలంలో 416ఇళ్లకు తాజాగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. దాదాపు 20ఏళ్లుగా నివాసముంటూ, విద్యుత్, జివిఎంసి, ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్న వీరందరికీ ఇపుడు సుప్రీంకోర్టు ఆదేశాలంటూ తహాశీల్దార్ నోటీసులు జారీ చేయడమేంటని ప్రశ్నించారు.

ఈ ప్రాంతంలో కోర్టు ఆదేశాలను ఎన్ని అమలు చేశారో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. ఒకవైపు జగనన్న కాలనీలు, ఇళ్లు అంటూ పేదలకు సొంతింటి సౌకర్యం కల్పిస్తున్న పరిస్థితుల్లో, నివాసముంటున్న ఇళ్లకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సబబని, వెంటనే వాటిని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు

సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, పేదల ఇళ్లను పీకేయాలన్న అధికారుల చర్యలను స్థానిక ప్రజాప్రతినిధులు అడ్డుకుని పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల కోల్పోతున్న నివాసితులు ఆందోళన చేస్తుంటే ఎన్నికల కోడ్ అంటూ అడ్డుకుంటున్న పోలీసులకు, ఇదే సమయంలో పేదలకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రభుత్వం జారీ చేసిన నోటీసులను వెనక్కు తీసుకోకుంటే రానున్న రోజుల్లో పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో మహిళా సంఘం నేత బి.అనంతలక్ష్మి సిఐటియు నేత అప్పలనాయుడు, అధిక సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం నేత రమణి

సూరిబాబు మృతికి సంతాపం

సూరిబాబు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ పంచాయతీ, సిటీనగర్‌కు చెందిన రవ్వ సూరిబాబు మృతికి సిఐటియు, కెవిపిఎస్, ఐద్వా, డివైఎఫ్ ఐ నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఉన్నత చదువు లు చదివి, జిల్లా సహకార బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్న సూరిబాబు శుక్రవారం హఠాన్మరణం చెందినట్లు కుటుంబ సభ్యులు వివరించారు. సూరిబాబు భౌతిక కాయాన్ని సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి రవ్వ నరసింగరావు, సిఐటియు నాయకులు ఎస్ అప్పల నాయుడు, ఐద్వా నాయకులు కె నాగరాణి, ఎస్ గున్న, భవాని, కెవిపిఎస్ నాయకులు భాగం లక్ష్మి, సోమి వెంకట్, గందవరపు కృష్ణ, ఎం శివ తదితరులు సందర్శించి సంతాపం తెలిపారు. ప్రతి అంశాన్ని సామాజిక కోణంలో ఆలోచించే వ్యక్తి సూరిబాబు అని ప్రజాసంఘాల నేతలతోపాటు పలువురు కొనియాడారు.

అనుబంధ సంఘాల అధ్యక్షులకు అభినందన

శివగణేష్‌ను అభినందిస్తున్న రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లాలో వైసిపి పలు అనుబంధ సంఘాలకు అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన విశాఖ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కెవి బాబా, యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్, సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు బి.రాధ, మహిళా విభాగం అధ్యక్షులు నల్లా కృపాజ్యోతి, ఐటి వింగ్ అధ్యక్షులు బొండా ఉమామహేశ్వరరావు తదితరులు శుక్రవారం విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు కలిసి కతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వారందరినీ కె.కె రాజు దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

వాణిజ్య విభాగం అధ్యక్షునిగా ఈశ్వరరావు

వై.వి.సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న వానపల్లి

ప్రజాశక్తి - ఆరిలోవ : వైసిపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులుగా 13వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు వానపల్లి ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనను ఈ పదవికి ఎంపిక చేసిన టిటిడి చైర్మన్, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. తన ఎంపికకు సహకరించిన వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, మాజీ మంత్రి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మలకు ధన్యవాదాలు తెలిపారు.

నాణ్యతా వ్యవస్థలను మెరుగుపరచాలి

ఎఫ్‌డిఎ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసా

అమెరికన్ కార్నర్‌లో ఎయు ప్రతినిధులతో ఎఫ్‌డిఎ బృందం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతీయ ఔషధ ఉత్పత్తి పరిశ్రమలు నాణ్యతా వ్యవస్థలను నిరంతరం మెరుగుపరచుకోవాలని అమెరికాలోని ఎఫ్‌డిఎ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసా అన్నారు. శుక్రవారం ఎయు వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎయు, యుఎస్ ఎఫ్‌డిఎ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన 'కరెంట్ గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్' వర్క్‌షాప్ రెండవ రోజున 'బలమైన నాణ్యత వ్యవస్థను నిర్మించడం' అంశంపై మాట్లాడుతూ ఫార్మ పరిశ్రమలు పారదర్శకంగా పనిచేస్తూ, నాణ్యమైన ఔషధాల తయారీకి నిరంతరం కృషి చేయాలని సూచించారు. నాణ్యత పరీక్షలో విఫలమైన ఔషధాలు రోగిపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సర్వసాధారణంగా పరిశ్రమల్లో జరిగే లోపాలు వాటిని గుర్తించే విధానాలను వివరించారు. ఎఫ్‌డిఎ వద్ద ఫొటోలు, ఆధారాలతో విస్తతమైన సమాచారం ఉంటుందనే వాస్తవాన్ని ఫార్మా పరిశ్రమలు విస్మరించరాదన్నారు. నమూనాల సేకరణ, రివ్యూ, నాణ్యత ప్రమాణాల వ్యవస్థను నిరంరతం పర్యవేక్షించడంలో అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. యుఎస్ కంజ్యూమర్ సేఫ్టీ ఆఫీసర్ సలీమ్ అక్తర్ రికార్డులను రూపొందించడం, భద్రపరచడం వంటి అంశాలను వివరించారు. సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూక్ హిగ్గిన్స్ ప్రోసెస్ ధ్రువీకరణ. అసెప్టిక్ కార్యకలాపాలను వివరించారు. ఒఆర్ఎ నేషనల్ ఎక్స్‌పర్ట్ జోన్ మెలెంజ్, అమెరికాకు చెందిన వయాట్రిస్ గ్లోబల్ క్వాలిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పురాణం, ఎయు ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, అంతర్జాతీయవ విద్యార్థి వ్యవహారాల డీన్ ఇఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు.

అమెరికన్ కార్నర్‌ను ఎఫ్‌డిఎ నిపుణుల బృందం సందర్శన

ఎయులోని అమెరికన్ కార్నర్‌ను డాక్టర్ కార్మిలో రోసా నేతృత్వంలోని ప్రతినిధుల బందం శుక్రవారం సందర్శించారు.అమెరికన్ కాన్సులేట్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమాలను కేంద్రం సమన్వయకర్త ఆచార్య జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. కార్యక్రమంలో ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డి, రెక్టార్ ఆచార్య కె. సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఒమేగా ఆసుపత్రిలో స్టోమా క్లినిక్

ప్రజాశక్తి - ఆరిలోవ :కొలోస్టోమీ, ఇలియోస్టోమీ వంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న కేన్సర్, ఇతర రోగులకు ఎదురయ్యే మలమూత్ర విసర్జన సమస్యలకు ఉపయోగించే స్టోమాపై అవగాహనకు ఆరిలోవ హెల్త్‌సిటీ ఒమేగా ఆసుపత్రిలో ఒక ప్రత్యేక విభాగాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒమేగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవిశకంర్‌తో కూడిన వైద్య బృందం విలేకర్లతో మాట్లాడుతూ, సాధారణంగా పెద్ద ప్రేగుకు కేన్సర్ వ్యాధి సోకిన వారికి ఒకొక్కసారి పెద్ద మలమూత్ర విసర్జన పేగును తొలగించాల్సి ఉంటుందన్నారు.. అటువంటప్పుడు ప్రత్యామ్నాయంగా స్టోమా బ్యాగులపై మలమూత్ర విసర్జన చేయాల్సి ఉంటుందన్నారు.. స్టోమాపై సరైన అవగాహన లేక చాలమంది ప్రాణాలు కోల్పోతున్నారని వెల్లడిచారు.ఈ బ్యాగులపై అవగాహన, అపోహలు తొలగించేందుకు ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా ఈ స్టోమా క్లినిక్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ బ్యాగుల నిర్వహణపై ఒమేగా ఆసుపత్రిలో వారానికి ఒక రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యశిబిరంలో రోగులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిబిరం నిర్వహణకు, స్టోమా బ్యాగులు, ఇతర పరికరాలు తయారుచేసే కోలోప్లాస్ట్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదర్చుకున్నట్టు తెలిపారు. సమావేశంలో డాక్టర్ కె.విజయ్, డాక్టర్ వి.కళ్యాణ్, కె.వి.సుబ్రహ్మణ్యన్, కోలోప్లాస్ మేనేజర్ డాక్టర్ రాఘ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఒమేగా డాక్టర్ రవిశంకర్

ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు

ఓటేసేందుకు క్యూలో ఉన్న మహిళా న్యాయవాదులు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నం జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి తెలిపారు. ఏడాది కాలపరిమితితో జరగనున్న సంఘం ఎన్నికలకు ఉదయం 10గంటలకు ప్రారంభమైన పోలింగ్ మొదట మందకొడిగా సాగినప్పటికీ, 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఊపందుకుంది. మొత్తం 3820మంది సభ్యులకు ఓటు హక్కు ఉండగా, ఏడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మహిళా న్యాయవాదాలకు వేరేగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఎటువంటి అలజడి లేకుండా ఎనినక సాఫీగా సాగింది. సాయంత్రం నాలుగుగంటలకు 2127మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా న్యాయవాదులు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. సహాయ ఎన్నికల అధికారులు ఎంకె.శ్రీనివాస్, బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం

- సిపిఎం నిరసన

ప్రజాశక్తి-చింతూరు

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మోడీ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం ఐటిడిఎ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీనికి ముందు ఎర్రంపేట నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, విభజన హామీలను అమలు చేయాలని, నాలుగు మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని, తునికాకు ప్రూనింగ్ పనులు తక్షణమే చేపట్టాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

విలీన మండలాల పర్యటనలో భాగంగా చింతూరు ఐటిడిఎకు విచ్చేసిన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆందోళన వద్దకు వచ్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు తదితరులు కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. ధాన్యం కొనుగోలు సరిగా చేపట్టకపోవడంతో ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పశువులు పాలవుతున్నాయని తెలిపారు. ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి, డబ్బులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలపై

ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

- సమావేశం మినిట్స్‌లో తీవ్ర అన్యాయం చేసే అంశాలు
- సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, చిన్నకళవలాపల్లి, కొత్తపేట, గోవిందపురం, వాడపాలెం, ఎన్ఎఒబి నిర్వాసిత కాలనీలకు చెందిన ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కార్యదర్శి జి.దేముడునాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్వాసితులు 117 రోజులు నుండి తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన జిల్లా అధికార యంత్రాంగం ఉదాసీనంగా వుందన్నారు. దేశ రక్షణ కోసం తమ భూములను, జీవనోపాధి ఇచ్చే సముద్రం, శారదా, వరహా నదులను మత్స్యకారులు త్యాగం చేశారని గుర్తు చేశారు. వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇవ్వకుండా జరిలం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. జిల్లా కలెక్టర్ 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాల్సింది పోయి మేనమీషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. దిగువ స్థాయి అధికారులతో తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహించి నిర్వాసితుల సమస్యలపై కాలయాపన చేయడం సరికాదని తెలిపారు. ఈ నెల 8న మత్స్యశాఖ ఎడి, డిప్యూటీ కలెక్టర్, అనకాపల్లి ఆర్డీఒలు నిర్వాసిత నాయకులతో జరిపిన చర్చల మినిట్స్ కాపీని శుక్రవారం విడుదల చేశారని, అందులో పొందుపర్చిన అంశాలు ఆమోదయోగ్యంగా లేవని పేర్కొన్నారు.

వాడనర్సాపురం, కొత్తపట్నం, వాడపాలెంలో చేపలు వేటాడే బోట్లుకు రూ.2.50 లక్షలు వన్‌టైమ్ ప్యాకేజీ ఇవ్వడానికి నిర్ణయించారని, అయితే ఒక బోటు తయారు చేయడానికి లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెడుతుంటే అతి తక్కువ డబ్బులు ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. వాడపాలెంలో వేటాడే మత్స్యకారులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేమని చెప్పడం దారుణమన్నారు. శారద నదిలోకి బోట్లు వేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లో అర్హులైన మత్స్యకార కుటుంబాలకు మాత్రమే 10 నెలల పాటు నెలకు రూ.13వేలు చొప్పున ప్యాకేజీ ఇస్తామని ప్రకటించారని, కాని అర్హులైన వారి జాబితాను ప్రకటించకపోవడం విడ్డూరంగా వుందని పేర్కొన్నారు. కొప్పుగొండుపాలెం నిర్వాసిత పంచాయితీలలో ఒకటిగా వుందని, ఆ గ్రామం చుట్టూ నేవీ రక్షణ గోడ కట్టడంతో ఉపాధి కోల్పోయారని, వారికి 5 నెలలు మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇచ్చుటకు ప్రతిపాదనలు పంపడం దుర్మార్గమన్నారు. చిన్నకళవలాపల్లి, కొత్తపేట, గోవిందపాలెంలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించడంలో మొదటి నుండి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, భూములు, ఉపాధి కోల్పోయిన వారికి నిర్వాసిత ప్యాకేజీ ఇవ్వమని ఆందోళన చేస్తూంటే ఎన్ఎఒబి రెండో దశలో తప్ప ఈ దశలో ఇవ్వమని కరాఖండిగా చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. ఎన్ఎఒబి నిర్వాసిత కాలనీలైన వేల్పులుగుంటపాలెం, దేవళ్ళపాలెం, పిసినిగొట్టిపాలెం, రేవువాతాడలలో ఉన్న 407 కుటుంబాలకు జీవనభృతి ప్రస్తావన కూడా లేకపోవడం దారుణమన్నారు. నిర్వాసితుల డిమాండ్లు పరిష్కరించే దిశలో కాకుండా వారికి మరింత అన్యాయం చేసే విధంగా మినిట్స్ ఉందని పేర్కొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు పరిశీలించారు. హాజరు పట్టికను తనిఖీ చేసి అందులో పలు తప్పులు ఉండడంతో వీఆర్పీ నాగమణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులకు హాజరు కాని వారికి కూడా హాజరు వేయడంతో అవకతవకలు జరిగినట్లు భావించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ధర్మారావుకు సూచించారు. కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే ప్రతిరోజు 257 రూపాయలు కూలి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి మజ్జి అలివేణి, సర్పంచ్ పలక భాగ్యలక్ష్మి సత్తిబాబు, వైస్ సర్పంచ్ పి భవాని, చవ్వాకుల ఈశ్వరరావు, ఎం సతీష్, వైసిపి నాయకులు పెద్దాడ రామశంకర్, గ్రామ కార్యదర్శి శ్రావణి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మందులు అందజేస్తున్న దృశ్యం

మైహోం ఆధ్వర్యాన విద్యార్థులకు వైద్య శిబిరం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

మండలంలో ములకలపల్లి గ్రామం వద్ద ఉన్న మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి ఏటికొప్పాకలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ (వర్కింగ్) వివిఎస్ .చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు వైద్య సేవలు అందించాలని సదుద్దేశంతో ఈ ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ మెడికల్ క్యాంపులో 550 మందికి వైద్య పరీక్షలు, నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబమూర్తి, ప్రియా, నరేష్ కుమార్ ఎల్ వి ప్రసాద్ కంటి వైద్యులు, ప్రధాన ఉపాధ్యాయులు కె గణపతి రావు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డిప్యూటీ సిఎం ప్రశంస

ప్రజాశక్తి-దేవరాపల్లి

అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సేపక్ తక్రా ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రశంసించారు. మండలంలోని పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది బాలబాలికలు అండర్ 14, 17లో పాల్గొని ప్రతిభ కనబర్చినారు. ఈ సందర్భంగా తారువలోని ఉపముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో బూడి ముత్యాలనాయుడును శుక్రవారం కలిశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, చైర్మన్ అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్‌పి వైస్ చైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో గ్రామ దేవత శ్రీపరదేశిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు శుక్రవారం ప్రారంభించారు. వైసిపి నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో గ్రామ సర్పంచ్ బోకం స్వామినాయుడు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ తవ్వవానిపాలెం గ్రామాన్ని బోకం శ్రీనివాసరావు సొంత నిధులతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కబడ్డీ పోటీలు శుక్రవారం, శనివారం రెండు రోజులు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, నాలుగో బహుమతి రూ.8 వేలు చొప్పున అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు, పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాసరావు, సర్పంచ్ బోకం స్వామినాయుడు, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు, మండల వైసిపి యువజన విభాగ అధ్యక్షుడు యడ్ల నాయుడు, సచివాలయం కన్వీనర్ బోకం నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ వనం దేముడుబాబు, వార్డ్ మెంబర్లు, శ్రీనివాస్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

ప్రజాశక్తి-సబ్బవరం

ఈ నెల 22, 23 తేదీలలో అనకాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వీరు తయారు చేసిన మోడల్ "పర్యావరణం - వాతావరణ మార్పులు"కు సంబంధించిన కేటగిరీలో పాల్గొని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్.చిన్నమ్మాయి తెలిపారు. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా ఆర్.ప్రసాద్, విద్యార్థిని బి.మోన్విత నాయకత్వం వహించారు. జిల్లాస్థాయిలో ఎంపిక కావడంతో ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు ఇన్‌ఛార్జి హెచ్ఎం తెలిపారు. జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీలలో పాల్గొన్న కె.కుసుమ ద్వితీయ స్థానంలో నిలిచింది. బి.మోన్విత రాష్ట్ర స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనుటకు అర్హత సాధించడం పట్ల మండల విద్యా శాఖాధికారి యస్.అప్పలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనుట ద్వారా, వారిలో దాగిఉన్న సృజనాత్మకత, ప్రేరణ, శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పట్ల మక్కువ పెరుగుతుందని ఎంఇఒ తెలిపారు.

సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థినులు, చిత్రంలో ఎంఇఒ అప్పలరాజు

28లోగా రైతులు ఇకెవైసి చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 28లోగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని, ఆ జాబితాను మాత్రమే మార్చి 1న సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలను ఉంచడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు తెలిపారు. జిల్లాలో ఇంత వరకు రబీ 2022-23 సీజన్లో 42,254 ఎకరాల పంట సాగు జరగగా అందులో 41,580 ఎకరాలకు ఈ-పంట నమోదు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు ఇంత వరకు 39,239 ఎకరాల ఈ- పంట ధ్రువీకరించడం జరిగిందన్నారు. రైతులు పంటల బీమా, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట కొనుగోలు వంటి పథకాలకు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేసిన ఎల్ఐసి ఏజెంట్

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది కొత్తూరులో ఎల్ఐసి ఏజెంట్ వర్రి ఈశ్వరరావు తన సొంత నిధులు రూ.1.5 లక్షలతో శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు. తన తల్లిదండ్రులు సన్నిబాబు, అప్పలమ్మల జ్ఞాపకార్థం ఈశ్వరరావు శ్మశానంలో కాటికాపరి హరిచంద్రుడి విగ్రహం, శివుడి విగ్రహం, సిమెంటు దిమ్మ నూతనంగా నిర్మించారు. వీటిని టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు శుక్రవారం ఆవిష్కరించారు. దాతలు వర్రి ఈశ్వరరావు, లక్ష్మి దంపతులను అభినందించారు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయడం మంచి నిర్ణయమన్నారు. శిల్పి బర్ల అప్పారావుని సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టూజీ ఉపసర్పంచ్ సయ్యపురెడ్డి శ్రీనివాస్, మంచాల గోవింద, వర్రి రాము నాయుడు, నాళం రాము తదితరులు పాల్గొన్నారు.

హరిచంద్రుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తాతయ్యబాబు

మాట్లాడుతున్న మరిసా పెదరమణ తదితరులు

ప్రభుత్వ భూములను
అన్యాక్రాంతం చేస్తున్న అధికార పార్టీ నేతలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : రాజాం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, రెవెన్యూ అధికారులు కలిసి అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారని, రాజాం గ్రామానికి చెందిన ప్రస్తుత ఎంపీటీసీ భర్త, మాజీ సర్పంచ్ మరిసా పెద రమణ, మాజీ ఎంపీటీసీ మరిసా సతీష్ ఆరోపించారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజాం సర్వే నెంబరు 233లో గల కొండ పోరంబోకు సుమారు 30 ఎకరాల భూములను ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ అవసరాలకు, గత 30 సంవత్సరాల నుంచి కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఈ భూముల్లో చిట్టియ్యాపాలెం గ్రామస్తులు సోషల్ ఫారెస్ట్ వారి ద్వారా మొక్కల పెంచుతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు , రాజకీయ నాయకులు కలిసి సదరు భూములను రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగస్తులకు డి పట్టాలు ఇవ్వడానికి, లక్షలాది రూపాయల చేతులు మారడానికి బేరాలు సిద్ధంగా చేసుకున్నారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకుల ఆధ్వర్యంలో ఈ వ్యవహారాల సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ భూముల జోలికి వస్తే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల తెలుగు రైతు అధ్యక్షులు మరిసా నరేష్, చోడవరం నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ వల్లి, మాజీ సర్పంచ్ ఎండపల్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు బీమా సదుపాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేసే రైతుల పశువులకు పశుబీమా సదుపాయం కల్పించినట్లు ఆ డెయిరీ మేనేజర్ కె శేషు చెప్పారు. మండలంలోని ఎం జగన్నాధపురం గ్రామంలో శుక్రవారం పాడి రైతు పి ఆదిలక్ష్మికి రూ.30వేలు బీమా సొమ్ము శేషు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన హెరిటేజ్ డెయిరీ రైతుల శ్రేయస్సుకు అమలుపరుస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు బి నాగేశ్వరరావు, పి. అప్పారావు, నూకరాజు, బుల్లి బాబు, నంద, జీవన్ పాల్గొన్నారు.

సైకిల్‌పై షిరిడీకి పయనం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు శుక్రవారం సైకిల్‌పై షిర్డీ యాత్ర తలపెట్టారు. ఈ యాత్రను వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షుడు సరగడం జగ్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ యాత్రతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని తెలిపారు. యాత్రలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సైకిల్ యాత్రకు పూడి నాగు, పోలార్సు జగ్గారావు, పి నానాజీ, పి గోవిందా, బుజ్జి, బత్తిన నాగార్జున బయలుదేరారు. ఈ కార్యక్రమంలో తనకాల లక్ష్మి, మల్ల శివ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని సీతమ్మ పేట గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ ఆలయ నిర్మాణం కొరకు పైలా గతంలో రూ.25 వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి పుష్ప, వైస్ సర్పంచ్ జెక్కన సింహాచలమ్మ, టిడిపి నాయకులు కర్రి నాయుడు, పరవాడ రవి, కర్రి శ్రీను, ఆదిరెడ్డి నాయుడు, కర్రి యెర్నాయుడు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు

వికలాంగురాలికి దక్కని 'జల్ జీవన్'

భూషణంతో పాటు మరో ఐదు ఇళ్లకు తాగునీటి కుళాయిలు వేయని వైనం

ప్రజాశక్తి-వడ్డాది

ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం ఓ వికలాంగురాలి ఇంటికి జల్ జీవన్ మిషన్ ద్వారా వేస్తున్న ఇంటింటికి తాగునీటి కుళాయిని వేయలేదు. బుచ్చయ్యపేట మండలం, లోపూడి పంచాయతీ బంగారు మెట్ట గ్రామానికి చెందిన 55 ఏళ్ల తమరాన భూషణం పుట్టుకతోనే వికలాంగురాలు. భూషణం ఆమె తల్లి 85 ఏళ్ల తలుపులమ్మతో కలిసి జీవిస్తుంది. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా లోపూడి పంచాయితీ పరిధిలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. కానీ బంగారుమెట్ట ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న భూషణం ఇంటితో పాటు మరో ఐదు కుటుంబాల ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేయలేదు. మొదటిగా వికలాంగురాలు భూషణం ఇల్లు ఉంది. ఈ ఇళ్లకు కళాయిలు వేయాలని గ్రామ వాలంటరీ ద్వారా పలుమార్లు సచివాలయ సిబ్బందికి తెలియజేసినా

బాధితురాలు భూషణం

పట్టించుకోలేదు. గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయిలు వేసి, తమకు మాత్రం వేయకపోవడంపై భూషణం ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై స్థానిక సచివాలయ సిబ్బందిని వివరణ కోరగా ఆ ఇంటికి కుళాయి వేయడానికి దారి లేదని, చుట్టుపక్కల వారు అభ్యంతరాలు తెలుపుతున్నారని తెలిపారు. దీంతో భూషణంతో పాటు తమరాన దేవుడు, తమరాన మంగ, తమరాన లక్ష్మి, వాయిలాడ నాగరత్న చౌదరి, తమరాన తలుపులమ్మ కుళాయిలు వేయకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. భూషణం ఇల్లు దాటితే కానీ మిగతా కుటుంబాలకు వెళ్లే అవకాశం లేదు. దీంతో ఆరు కుటుంబాలకు ఇంటింటి కుళాయిలు లేకుండా పోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వికలాంగురాలైన భూషణం, వృద్ధ, వితంతు కుటుంబాల ఇళ్లకు కుళాయిలు వేయాలని వారు కోరుతున్నారు.

బొగ్గు లారీల కాలుష్యాన్ని అరికట్టాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ

మండల కేంద్రం పరవాడ గుండా ప్రయాణిస్తున్న హిందూజా బొగ్గు లారీలను వెంటనే నిలుపుదల చేయడం ద్వారా బొగ్గు లారీల కాలుష్యాన్ని అరికట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లంకెలపాలెం పరవాడ మీదుగా ప్రయాణిస్తున్న బొగ్గులారీలు వలన ఈ మార్గంలో ప్రయాణిస్తున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, రోడ్డుకి ఇరువైపులా ఉన్న నివాస గృహాలు వారు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పరవాడ తహశీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలు బొగ్గు లారీల కాలుష్యంతో మసిబారినట్లు పేర్కొన్నారు. పరిమితికి మించి బొగ్గు లోడుతో నడుస్తున్న లారీలపై రవాణా శాఖ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై బొగ్గు లారీలు నిలుపుదల చేస్తున్నా పోలీస్ అధికారుల చర్యలు శూన్యమన్నారు. బొగ్గు లారీ యాజమాన్యాలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అండగా నిలుస్తున్నారని విమర్శించారు. హిందూజ పరిశ్రమ యాజమాన్యంతో ఎమ్మెల్యే కుమ్మక్కయ్యారని గనిశెట్టి దుయ్యబట్టారు. రోడ్లు పూర్తిగా గోతులమయమై అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వ యంత్రాంగంలో చలనం లేదన్నారు. భవిష్యత్తులో బొగ్గు లారీల కాలుష్యంపై భారీ ఆందోళన చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు. వెంటనే రోడ్లు మరమ్మతులు చేయాలని, పరిమితికి మించి లోడ్ వేస్తున్న బొగ్గు లారీలపై ఆర్టీవో అధికారులు చర్యలు చేపట్టాలని, రోడ్లపై బొగ్గు లారీలు నిలిపిస్తున్న వారిపై పోలీస్ శాఖ వారు కేసులు నమోదు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

దగ్గరుండి పారిశుధ్య పనులు చేయిస్తున్న ప్రసాద్

ప్రజాశక్తి- కె.కోటపాడు

గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయితీ విస్తరణ అధికారి పి.ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. సంతబయలు వద్ద ఉన్న చెత్తా చెదారమును ఆయన దగ్గర ఉండి పంచాయితీ పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 32 పంచాయతీలలో చౌడువాడ, కింతాడ, గుల్లేపల్లి, ఎ.కోడూరు, శృంగారం, పిండ్రంగి తదితర ఆరు గ్రామాలను సంపూర్ణంగా పారిశుధ్య నిర్వహణకు ఆరు నెలల క్రితం ఎంపిక చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ ఆ గ్రామాలలో సంపూర్ణ పారిశుధ్యం ఏ కోశాన్న కనపడలేదన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులపై అలసత్వం వహించడం తగదన్నారు. గ్రామాలలో వీధుల్లో, సందులలో పారిశుధ్య పనులు చేయకపోయినప్పటికీ కనీసం మెయిన్ రోడ్డు అయినా పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాను ప్రతి గ్రామానికి వెళ్లి దగ్గర ఉండి పారిశుధ్య పనులు చేపట్టడం సాధ్యం కాదన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి నక్క రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

తుప్పు పట్టిన, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పిడి కారణంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ ఎస్ రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పట్టణంలోని వుడ్ పేట, చదువుల వారి వీధి, మల్ల వీధి, కాశీ విశ్వనాథం ఆలయ ప్రాంతం, వేల్పుల వీధి చవితిన వీధి, నరసింగ రావు పేట, జీవి కోటేశ్వరరావు వీధి, గూడ్స్ రోడ్డు, జార్జి క్లబ్ ప్రాంతం, శాఖ వీధి, నాగవంశం వారి వీధి, భీముని బొమ్మ, రైల్వే స్టేషన్ రోడ్డు, ఉడ్ పేట చిరంజీవి కాంప్లెక్స్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వాడ్రాపల్లిలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : వైయస్సార్ కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో శుక్రవారం వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం నూకరాజు ప్రారంభించారు. 60 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఈ పరీక్షలు నిర్వహించారు. 100 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేశారు. ఆపరేషన్ అవసరం అనుకున్న వారికి ఉచితంగా శస్త్రచికిత్స చేయించడం జరుగుతుందని నూకరాజు తెలిపారు. డాక్టర్ జి. సంధ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లపై ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని తాళ్లపాలెం ఎపిఇపిడిఇసిఎల్ సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ లైన్లపై ఉన్న చెట్టు కొమ్మలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎఇ బివిఎల్‌వి నాయుడు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు నుండి సరఫరా వైర్లపై గాలి ఇతర కారణాల వల్ల కొమ్మలు పడి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అందుకే ఈ కొమ్మలు తొలగించినట్లు చెప్పారు.

నేడు టిడిపి మండల అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో మాజీ మంత్రి బండారు సత్య నారాయణమూర్తి స్వగృహం వద్ద టిడిపి మండల అత్యవసర సమావేశం శనివారం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బండారు సత్యన్నారాయణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, మండలంలోని టిడిపి నాయకులు, మాజీ ఎంపిపిలు, మాజీ జెడ్పీటీసీలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

మహిళా రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-చోడవరంరూరల్ : మండలంలోని రాయపురాజుపేట లక్ష్మీవారంలో మహిళా రైతు శిక్షణ శిబిరం అనకాపల్లి ఏరువాక ప్రిన్సిపాల్ వి.గౌరీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఇందులో పాల్గొన్న స్థానిక సర్పంచ్ రామానాయుడు మాట్లాడుతూ వ్యవసాయంలో మెళకువలు నేర్చుకోవాలన్నారు. వ్యవసాయానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానం చేయడానికి ఒక తీర్మానం రాసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లయితే రైతుకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా రైతులు, అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 82వ వార్డు అంజయ్య కాలనీ సంయుక్త డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్తలను వేరు చేయడం, వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి గోవిందరావు, దాడి మహేష్ బాబు, ఆర్ రవికుమార్, డి భాస్కరరావు, చిరంజీవి, కె లోవ పాల్గొన్నారు.

పేదలకు ఆహారం ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు, వికలాంగులకు, వృద్ధులకు, యాచకులకు ఆహార ప్యాకెట్లు శుక్రవారం పంపిణీ చేశారు. వైసిపి మండల అధ్యక్షులు కర్రి బాబు చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ కార్యక్రమం సబ్బవరం, పెందుర్తి, చినముసిడివాడ, సుజాతనగర్, వేపగుంట, గోపాలపట్నం, ఎన్ఎడి కొత్త రోడ్డు, కంచరపాలెం వరకు 150 మంది యాచకులకు ఆహారం పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు వి.సత్య గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ పి. శ్రీనివాసరావు, తారకేశ్వరి, జ్యోతి, సత్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని గొకివానిపాలెం గ్రామంలో ఉన్న శ్రీషిర్డీ సాయి ఆలయ 19వ వార్షికోత్సవం, శ్రీవరసిద్ధి వినాయకాయ ఆలయ 6వ వార్షికోత్సవం శనివారం జరుగుతుందని ఆలయ కమిటీ వ్యవస్థాపకులు రౌతు సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని, చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కోటవురట్లపై ఎమ్మెల్యే చిన్నచూపు!

-మొక్కుబడిగానే గడపగడపకూ- అదేమాదిరిగానే సమస్యల పరిష్కారం
-అధికార పార్టీ శ్రేణుల్లోనే అసంతృప్తి, అసహనం

ఎమ్మెల్యేకు సమస్యలు చెబుతున్న మహిళ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల సమస్యలపైనా, మండలంలో రాజకీయాల పట్ల స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చిన్నచూపు చూస్తున్నారని ఇటు ప్రజలు అటు అధికార వైసిపి నాయకులు తీవ్ర అసంతప్తి అసహనం వ్యక్తం చేస్తున్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన భ్రుత్వం కార్యక్రమం కూడా మండలంలో మొక్కుబడిగానే నిర్వహించారని, దీంతో సమస్యల పరిష్కార చర్యలు లేక ఎక్కడికక్కడే తిష్టవేసి ఉన్నాయని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలు కూడా మండలంలో నత్తనడకనే సాగుతున్నాయి మండల వ్యాప్తంగా 25 పంచాయతీలకుగాను 12 గ్రామపంచాయతీలో నేటికీ కాలనీ ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టలేని పరిస్థితి ఉందని ఆయా ప్రాంత వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు, జగనన్న ఇళ్ల పథకం కింద మండలంలో 1507 ఇళ్లు మంజూరైతే వాటిల్లో కేవలం 600 ఇళ్లు మాత్రమే నిర్మాణదశలో ఉన్నాయంటే పథకం అమలులో ఎమ్మెల్యే చిత్తశుద్ధి, పనిచేయని అధికారులను అదిలించి పనిచేయించడంలో చొరవ లేకపోవడాన్ని బట్టి మండలం పట్ల ఎమ్మెల్యే ఎంత చిన్నచూపు చూస్తున్నారో స్పష్టమౌతోందని అంటున్నారు.

కొన్ని గ్రామాలలో ప్రభుత్వం డబ్బులు చెల్లించి ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి పంపిణీ చేసినా, ఆయా ప్రాంతాల్లోనూ ఇళ్ల నిర్మాణాలు ఆశించిన స్థాయిలో సాగకపోవడం ఎమ్మెల్యే పనితీరుకు అద్దం పడుతోందని అంటున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లు గ్రంథాలయాలు ఇలా ఒక్కటేమిటి అభివృద్ధి పథకాలన్నీ అరకొరగానే దర్శనమిస్తున్నాయని అంటున్నారు. సకాలంలో బిల్లుల చెల్లించక నిర్మాణాల్లో జాప్యం జరుగుతుంటే, సమస్యలను పరిశీలించి పరిష్కరించడంతో ఎమ్మెల్యే బాబూరావు కనీస చొరవ చూపకపోవడం ఈ వెనుకబాటుతనానికి కారణమనే ఆరోపణలు ఉన్నాయి.

మండలంలో అసంపూర్తిగా నిలిచిన పందూరు, జల్లూరు, వంతెనలు, ఎమ్మెల్యేను మాత్రమే కాదు మండల వాసులను వాహన చోదకులను ప్రయాణికులను వెక్కిరిస్తున్నాయి. అంతేకాక గిరిజన గ్రామాలైన కోదండరాంపురానికి అసంపూర్తి రోడ్డు నిర్మాణం, అనుకు, అల్లు ముయ్య పాలెం, గ్రామ రహదారుల సంగతి పూర్తిగా మర్చిపోవడం ఇవన్నీ మండలంపై ఎమ్మెల్యే బాబూరావు చిన్నచూపుకు నిదర్శనాలని వైసిపి నేతలు సైతం బాహాటంగానే తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి సంబంధించి ఏ ఒక్క నాయకుడికి కూడా గుర్తింపునిచ్చేలా సరైన పదవి ఇవ్వకపోవడం కూడా ఎమ్మెల్యే వైఫల్యమేనన్న వాదన వినిపిస్తోంది. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి అత్యధిక మెజారిటీ అందజేసిన కోటవురట్ల మండలం పట్ల స్థానిక ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరు కారణంగా రానున్న ఎన్నికల్లో మండలంలో వైసిపి గడ్డు పరిస్థితిని ఎదుర్కోక తప్పదని అధికార పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో సంతృప్తి కానవస్తున్నా, నేతలు, ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరుతో ప్రజల్లోనూఅసంతృప్తి కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకుమరో ఏడాది మాత్రమే గడువున్న పరిస్థితుల్లో ఇప్పటికైనా మేలుకోకుంటే, కోటవురట్లలో వైసిపికి ఎదురుగాలి తప్పదని పలువురు అంటున్నారు.

రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గుడ్డిప పంచాయతీ శివారు కొత్తూరు గ్రామంలో రక్షిత మంచినీటి పథకం పైప్ లైను రంధ్రం పడటంతో 10 రోజులుగా మంచినీటి కుళాయి నుంచి నీరు వృథాగా పోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతుకు అవసరమైన సామగ్రిని కూడా గ్రామస్తులమే కొనుక్కున్నామని, కానీ అధికారులు, సర్పంచ్‌ను పలుమార్లు కోరినా స్పందించ లేదని మహిళలు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రానున్న వేసవి కాలంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటామని గ్రామస్తులు తెలిపారు.

కార్యకర్తలే పార్టీకి బలం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:కార్యకర్తల శ్రేయస్సే పవన్ కళ్యాణ్ లక్ష్యమని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన నర్సీపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ, కార్యకర్తల కుటుంబాలకు ఇన్స్యూరెన్స్ అందించి భరోసా కల్పిస్తున్నారన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుకు పవన్ కళ్యాణ్ కోటి రూపాయల విరాళాన్ని అందజేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో క్రియాశీల సభ్యత్వ నమోదును చురుగ్గా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు కొత్తకోట రామశేఖర్, మారిశెట్టి రాజా, నాతవరం మండల యువత అధ్యక్షులు బైన మురళీ, గొలుగొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యచంద్ర

బాధితునికి నగదు, సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రేబాక గ్రామంలో గురువారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన కర్రీ నాగేశ్వరరావుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. నగదు, సామాగ్రి, విలువైన పత్రాలు, బట్టలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గ్రామ సర్పంచ్ సాది రెడ్డి శ్రీనివాసరావు వెంటనే స్పందించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు కూడా గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రైస్, నిత్యావసర సరుకులు అందజేశారు.తహసీల్దార్ నీరజ శుక్రవారం గ్రామానికి వెళ్లి కాలి బూడిదైన ఇల్లును పరిశీలించారు. తమను అన్ని విధాలా ఆదుకోవాలని బాధితులు తహసీల్దార్ ను కోరారు.

నగదు, సరుకులు ఇస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

విద్యుత్ తీగలను తొలగించరూ..

ప్రజాశక్తి-రావికమతం:కవగుంట గ్రామంలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు కోరారు. ఈ విషయమై గత మూడు నెలల క్రితం జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. దీనికి స్పందించిన ఏఈ బాధితుల ఇళ్లకు వద్దకు వచ్చి సెల్ఫీ ఫోటో, సంతకాలు తీసుకొని ఫిర్యాదును విత్ డ్రా చేసుకున్నారన్నారు. గ్రామంలో వోల్టేజీ సమస్య ఉందన్నారు. గ్రామంలో సర్పంచ్ ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోతే సామాన్య మానవుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

రైతులు ఇకెవైసి చేసుకోవాలి

మాట్లాడుతున్న రవిప్రకాష్

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:ఈ పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ నెల 28వ తేదీ లోపు ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని ఎలమంచిలి సబ్ డివిజన్ సహాయ సంచాలకులు రవి ప్రకాష్ తెలిపారు. మండలంలోని లింగరాజుపాలెం గ్రామంలో పర్యటించిన ఆయన రైతు భరోసా కేంద్రం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు ఈ కేవైసీ నమోదుపై వరించాలన్నారు. రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సౌజన్య, రైతు భరోసా కేంద్రం సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి మరమ్మతులు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో పి.పొన్నవోలు గ్రామ పంచాయతీ శివారు కుముందానిపేట గ్రామంలో మరమ్మతుకు గురైన రక్షిత మంచినీటి పథకం పనులను సర్పంచ్ విరోతి రాజారావు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజారావు మాట్లాడుతూ,కొత్త మోటారును తెప్పించి తాగునీటి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. వేసవికాలం దృష్టాయ ప్రజలకు మంచినీటికి ఇబ్బంది కలగకూడదని చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీలో శివారు గ్రామాలైన జి.చీడిపల్లి, ఆర్.కొత్తూరు, చినకుమందంపేట, పొన్నవోలులో నీటి కొరత లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు మెంబర్స్ పాల్గొన్నారు.

పనులు చేయిస్తున్న సర్పంచ్

నేటి నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొవ్వూరు గ్రామంలో ఈ నెల 25 నుంచి నాలుగు రోజుల పాటు గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ నెల 25న ఉత్సవమూర్తులను భక్తుల సందర్శనార్థం ఉత్సవ స్థలంలోని పల్లకిలో ఉంచుతామన్నారు. నాలుగు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే బంధువులు ఉత్సవ కమిటీకి సహకరించాలని నిర్వాహకులు కోరారు.

27 వరకూ
ఓపెన్ స్కూల్ ప్రవేశాలు

ప్రజాశక్తి-రోలుగుంట:ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీ వరకు ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సహదేముడు తెలిపారు. గతంలో పదో తరగతి ఉత్తీర్ణత చెందిన, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువు మధ్యలో ఆపేసిన వారికి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు ఫీజులు ఆన్‌లైన్, నేరుగా తమ కళాశాలలో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 9985593881 నెంబరుకు సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

మంజూరు కాని బిల్లులు

నిలిచిన రోడ్డు పనులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో కొడవటిపూడి గ్రామ శివారు గిరిజన గ్రామమైన కోదండరామపురం రోడ్డు నిర్మాణ పనులు నిలిచి పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన మూడు సంవత్సరాల క్రితం కోటి 20 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిపి వేయడంతో పాటు చేసిన పనులకు సకాలంలో గుత్తేదారునికి బిల్లులు చెల్లించక పోవడంతో నిలిచి పోయాయి. అసంపూర్తిగా నిలిచిన పనులతో గ్రామస్తులు మరింత అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా రాత్రి సమయంలో గ్రామంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మెటల్ వేసి వదిలేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా పనులకు బిల్లులు చెల్లించడంతో పాటు పనులు మొదలుపెట్టాలని గ్రామ సర్పంచ్ అప్పారావు కోరారు.

అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

కత్తితో దాడి కేసులో
వాలంటీర్‌పై చర్యలు

ప్రజాశక్తి-మాకవరపాలెం: లచ్చన్నపాలెం గ్రామంలో ఇటీవల కత్తితో ముగ్గురు వ్యక్తులపై దాడి చేసిన వాలంటీర్‌ను సస్పెండ్. చేసామని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దాడి ఘటనలో పోలీస్‌లు కేసు నమోదు చేశారన్నారు. దీంతో వాలంటీర్‌ను సస్పెండ్ చేసామని ఎంపీడీవో తెలిపారు.

సమస్యలపై ప్రశ్నించే గొంతును గెలిపించండి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ - ఉత్సాహంగా సాగుతున్న ఎన్నికల ప్రచారం



పద్మనాభం మండలంలో ప్రచారం చేపడుతున్న రమాప్రభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం) పట్టభద్రుల, ప్రజా సమస్యలపై చట్టసభలో ప్రశ్నించి, పరిష్కారానికి కృషి చేసేందుకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం ఎంవిపి హెల్త్ ఎరీనాలో ఆమె ప్రచారం చేపట్టారు. పట్టభద్రులతో మాట్లాడారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలను మాటలతో మోసం చేస్తున్నాయన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నించటం లేదన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మూడున్నరేళ్లుగా ఒక్క నోటిఫికేషనూ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రశ్నించే గొంతుకగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పిడిఎఫ్ బృందం ఆర్‌కెఎస్‌వి.కుమార్, రాజేశ్వరరావు, యుఎస్ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, అష్రఫ్, చంటి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: పిడిఎఫ్ అంటేనే విద్యావంతుల అభిప్రాయాలను శక్తివంతంగా,స్వతంత్రంగా వినిపించే వేదిక అని, తాజా, మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీల వారసత్వాన్ని కొనసాగిస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి, మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో సిఐటియు జోన్ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి, మండల నాయకులు ఎస్ అప్పలనాయుడు, డి.బాబాజీ, ఐద్వా నాయకులు కె నాగరాణి, ఎస్.గున్న, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంపూర్ణ మద్దతు

పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామంలో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శుక్రవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజకుమార హంసను కలిశారు. కాగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలో ఐఆర్‌టి ఉపాధ్యాయులంతా పిడిఎఫ్ వెంటే ఉన్నారని, గత ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ఓట్లేశామని, ఈ సారికూడా పిడిఎఫ్‌కు సంపూర్ణ మద్దతుగా ఉంటామని ప్రకటించారు. పిడిఎఫ్ అభ్యర్థిగా రమాప్రభ ప్రచారానికి వెళ్లే ప్రాంతాలకు సంబంధించిన సమాచారం తమకు ఇస్తే అక్కడి ఐఆర్‌టి ఉపాధ్యాయులంతా ప్రచారంలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నేత ఆర్ఎస్ఎన్ మూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీలో సాగుతున్న ప్రచారం

ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

వెంకన్న ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు మార్చి 2 నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను శుక్రవారం సీఐ వి.నారాయణరావు, ఎస్ఐ శిరీష పరిశీలించారు. కొండపైకి వెళ్లే మెట్ల మార్గాన్ని పరిశీలించారు. భక్తుల తొక్కిసలాట లేకుండా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకునేటప్పుడు ప్రధాన రాజగోపురం పరిసరాల నుంచి పటిష్టమైన క్యూ లైన్లు నిర్మించాలన్నారు. 3వ తేదీ కల్యాణోత్సవం జరుగుతుందని, ఈ దృష్ట్యా నక్కపల్లి నుంచి ఉపమాక వరకూ వున్న రహదారిపై భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్ఐ శిరీషకు సూచించారు. ఉత్సవాలకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణ, రాజు పాల్గొన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్

జిల్లా అధ్యక్షురాలిగా సుజాత

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీ సర్పంచ్, మండల వైసిపి మహిళా అధ్యక్షురాలు లోచల సుజాతను అనకాపల్లి జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ, తనపై ఇంత నమ్మకం ఉంచి ఎంతో బాధ్యాతయుతమైన పదవిని ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, మూడు జిల్లాల ఇన్‌చార్జ్ వైవి సుబ్బారెడ్డి, అనకాల్లి జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్ఠతకు మరింత కష్టపడి పని చేస్తానని తెలిపారు.

చెక్ అందజేస్తున్న రామలక్ష్మి

రైతులకు రుణాలు అందజేత

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వేంపాడు పిఏసిఎస్‌లో శుక్రవారం పిఏసిఎస్ పర్సన్ ఇన్ చార్జ్ సూరకాసుల రామలక్ష్మి, గోవింద్ అధ్యక్షతన సొసైటీ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. రైతు రుణాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే, కొత్తగా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి, సొసైటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు సొమ్ము రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. రైతు రాకాతి జగ్గారావుకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కొత్తగా మంజూరు చేసిన వ్యవసాయ రుణాలను పలువురు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, అంజమ్మ, రైతులు కె.నాని,వి.కృష్ణ, జివి రమణ, వి.బాబ్జి, ఆర్.బాబురావు, ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి కో - ఆపరేటివ్ బ్యాంకు బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం కేంద్రంగా 23 సంవత్సరాలుగా విజయవంతంగా నడుస్తున్న శ్రీ కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు తమ 25వ శాఖను విజయవాడ గురునానక్ కాలనీలో తమ సొంత భవనంలో శుక్రవారం ప్రారంభించుకుంది. ఈ బ్రాంచిని బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరు రఘునాథరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో తమ బ్యాంకు సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకున్నామని, ఖాతాదారులకు నాణ్యమైన, సత్వర సేవలు అందించగలమని, అనువైన వేళలతో పాటుగా లాకర్ల సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. డిపాజిట్లుపై అధికవడ్డీ ఇస్తూ గృహ అవసరాలకు, చిన్న వ్యాపారులకు, అలాగే బంగారు ఆభరణాలపై రుణాలు మంజూరు చేస్తామన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు బ్యాంక్ ఎటిఎంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ సమాఖ్య అధ్యక్షులు, కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ వేమూరి వెంకటరావు, బ్యాంకు వైస్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, బ్యాంకు డైరెక్టర్ సిపి.రామారావు, విజయవాడ నగర మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, నగరంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరు రఘునాథరావు

వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వినూత్నమైన బంగారు ఆభరణాలను అందించే వైశ్యరాజు జ్యూయలర్స్ తన ఏడో షోరూమ్‌ను తగరపువలసలో శుక్రవారం ప్రారంభించింది. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మావతి, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్నారు. ప్రథమ కొనుగోలును జామి భోజరాజు చేశారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా బంగారు ఆభరణాల మార్పిడిపై తరుగు 6 శాతానికే అన్ని రకాల బంగారు ఆభరణాలను పొందవచ్చునని, అలాగే ప్రతి కొనుగోలుపై ఒక బహుమతిని పొందొచ్చని వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు తెలియజేశారు. ఈ ఆఫర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జ్యూయలర్స్ ఛైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణరాజు, డైరక్టర్లు వైశ్యరాజు నరేష్ రాజు, వైశ్యరాజు కిరణ్ కుమార్ రాజుతో పాటు జగ్గుపిల్లి సూరిబాబు, కస్టమర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎంపి ఎంవివి సత్యనారాయణ

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం ఎస్ఐ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల ముమ్మర తనిఖీలు నిర్వహించారు. త్రిపుల్ రైడింగ్, అతివేగంగా నడుపుతున్న 35 వాహనాలపై అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, యువతకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ,డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. హెల్మెట్లు ధరిస్తే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు అధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.